క్లుప్తంగా

నేడు జగ్జీవన్‌రాం జయంతి

ఒంగోలు: బాబూ జగ్జీవన్‌రాం జయంతి కార్యక్రమం బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ నేత కటారి శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసన సభ్యులు, రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

సుస్థిర అభివృద్ధే ప్రధాన లక్ష్యం



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కమిషనర్

ఒంగోలు టౌన్: ప్రస్తుత అవసరాలను తీర్చుకుంటూ భవిష్యత్తు అవసరాలకు వనరులను కేటాయించడం సుస్థిర అభివృద్ధి ప్రధాన లక్ష్యమని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధన(ఎస్డీజీ) మరియు స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల అమలుపై పురపాలక సంఘంలోని కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక వర్క్ షాపు నిర్వహించారు. పేదరికం, నిరుద్యోగ నిర్మూలన, ఆకలిని నివారించడం, ఆరోగ్యం, అందరికీ నాణ్యమైన విద్యను అందించడం ప్రధాన లక్ష్యాలుగా చెప్పారు. అలాగే పరిశుభ్రమైన తాగునీరు, లింగ సమానత్వం వంటి 17 లక్ష్యాలను ఐక్యరాజ్య సమితి నిర్దేశించిందని తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ వీరాంజనేయులు, ఉషరాణి, కన్సల్టెంట్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నిమ్మరసం చలివేంద్రం ప్రారంభం



నిమ్మరసం చలివేంద్రం, అల్పాహారం సెంటర్‌ను ప్రారంభిస్తున్న శిద్దా సుధీర్‌కుమార్

చీమకుర్తి: రామతీర్థం కేంద్రంగా కర్నూల్ రోడ్డులో గ్రానైట్ యజమాని, చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ శిద్దా సుధీర్‌కుమార్ చేతుల మీదుగా నిమ్మరసం చలివేంద్రంతో పాటు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. రామతీర్థం పరిసరాల్లో గ్రానైట్ కార్మికులు, ప్రయాణికుల వేసవి దాహార్తి తీర్చేక్రమంలో వెలుగు సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వెలుగు సుబ్బారావును సుధీర్‌కుమార్ అభినందించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి, గోల్డెన్ గ్రానైట్ క్వారీ మేనేజర్‌లు గిరి, సురేంద్ర, బొమ్మిశెట్టి కిరణ్, కాట్రగడ్డ రమణయ్య, స్థానికులు పాల్గొన్నారు.

నేడు బొగ్గులకొండ ప్రసన్నాంజనేయుడి తిరునాళ్ల

బల్లికురవ: మండలంలోని కూకట్లపల్లి గ్రామ సమీపంలోని బొగ్గులకొండ వద్ద వేంచేసి ఉన్న యోగ ప్రసన్నాంజనేయస్వామి 46వ వార్షిక తిరునాళ్ల బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త తాళ్ల శివశంకరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకుడు ప్రసాద్‌చే ఉదయం 5 గంటలనుంచి ఆంజనేయుడికి ఆకుపూజలు, సింధూర పూజ ప్రత్యేక అలంకరణ చేపడుతున్నట్లు చెప్పారు. అనేక మొక్కుబడి ప్రభలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు వేడుకల్లో పాల్గొనాలని ధర్మకర్త కోరారు.



స్టీమ్ ఇంజన్ (ఫైల్)



కరవదిలోని ఓవర్‌హెడ్ ట్యాంక్

గతమెంతో ఘనం

- నేడు తాగునీటి కోసం తహతహ
- కరవది రైల్వే స్టేషన్ దుస్థితి

ఒంగోలు రూరల్: గతంలో దశాబ్దాల పాటు స్టీమ్ ఇంజన్లకు నీటిని నింపడంలో కరవది సేవలందించింది. ఆ తర్వాత ఎంతో కాలం పాటు ఒంగోలు రైల్వేస్టేషన్‌కు నీటిని పంపింగ్ చేసిన ఘన చరిత్ర కూడా ఉంది. కానీ నేడు కరవది రైల్వే స్టేషన్‌లో తాగి నీటి వసతి లేక ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. వివరాలు.. కరవది సమీపంలో ఉన్న గుడ్లకమ్మ నది నుంచి కరవది రైల్వే స్టేషన్ వద్దకు పంపింగ్ జరిగేది. ఇక్కడి నుంచి అల్యూమినియం ఫిల్టర్ బెడ్‌ల సాయంతో 25 గ్యాలన్ల సామర్థ్యం ఉన్న ఫిల్టర్ బెడ్‌ల ద్వారా పింపింగ్ స్టేషన్ నుంచి ఒంగోలుకు సరఫరా చేసేవారు. అలాగే గతంలో ఒంగోలు రైల్వే స్టేషన్ రద్దీగా ఉంటున్న నేపథ్యంలో స్టీమ్ ఇంజన్లకు పూర్తిగా నీరు నింపే కార్యక్రమం కరవదిలోనే దశాబ్దాల పాటు కొనసాగింది. పంపింగ్ కోసం భారీ ఓవర్‌హెడ్ ఉండేది. అదంతా గతం. నాటి కాలంలో ఈ పంపింగ్ హౌస్ అంతటా రంగు రంగుల పూల మొక్కలతో, మామిడి, జామ, నేరేడు చెట్లు ఉండేవి. దారికి ఇరువైపులా ఉన్న కొబ్బరి మొక్కలు ప్రయాణికులకు స్వాగతం పలికేవి. ప్రస్తుతం ఈ సుందరమైన పార్కులో ఆలనాపాలనా లేకపోవడంతో చెట్లు ఎండిపోయి మీటర్ అడుగున ఎత్తు గడ్డి పేరుకుపోయి విష సర్పాలకు నిలయంగా మారింది. కాలక్రమేణ మల్లవరం నీటి రాకతో ఒంగోలు రైల్వే స్టేషన్‌కు కరవది నుంచి తరలించే అవసరం లేకుండా పోయింది.

ప్రస్తుతం కరవది స్టేషన్‌లో వేసిన రెండు బోర్లు ఉప్పు ప్రభావంతో తాగడానికి, ఇతర అవసరాలకు ఉపయోగపడలేదు. ఫలితంగా కుళాయిలు తుప్పు పట్టిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మల్లవరం నీరు నేడు గ్రామానికి వస్తున్న నేపథ్యంలో పంచాయతీ నుంచి ప్రత్యేకంగా అనుమతి పొంది రైల్వే స్టేషన్ తాగునీటి అవసరాలకు తరలించాలని ప్రయాణికుల సంఘం, అన్ని రాజకీయ పార్టీలు కోరుతున్నాయి.



పంపింగ్ స్టేషన్



గ్రౌండ్ రిజర్వాయర్



ఎండిపోయిన ట్యాప్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

కొత్తపట్నం: ప్రతి మహిళ ఎవరి మీద ఆధారపడకుండా, బానిస బతుకు బతకుండా, సొంత కృషితో ఆర్థికంగా ఎదగాలని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్రరెడ్డి అన్నారు. వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా మంగళవారం కొత్తపట్నం, ఈతముక్కల, మడనూరు, రాజుపాలెం, కె.పల్లెపాలెం, పాదర్తి, రంగాయపాలెం, ఆలూరు, గాదెపాలెం, మోటుమాల, గుండమాల, గమళ్ళపాలెం, సంకువారిగుంట, వజ్జిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్ ఆసరా నగదు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం షేక్ రజీయా సూల్తాన్ బేగం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలో 15 పంచాయతీలో 1,208 గ్రూపులకు గాను మూడో విడత రూ.9,19,08,553 నగదు వారి ఖాతాల జమ చేసినట్లు తెలిపారు. 1, 2, 3వ విడతలుగా కలుపుకుని 27,57,25,659 నగదు మహిళల అకౌంట్‌లో జయచేశారని తెలిపారు. రాష్ట్రం విడిపోయి ఎన్నో కష్టాల్లో ఉన్నప్పటికీ, కరోనా వచ్చి రెండేళ్ల పాటు కష్టాలు ఉండి డ్వాక్రా మహిళలకు మాట తప్పకుండా రుణం మీ ఖాతాలో వేయటం అభినందనీయమన్నారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ ప్రతి మహిళ వారి కాళ్ల మీద స్థిర పడటానికి ముఖ్య మంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఎన్నో పథకాలు పెట్టారన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషన పథకం, నాడు–నేడు ద్వారా పాఠశాలలు ఆధునికీకరణ, దిశ చట్టం, ఇళ్ల పట్టాలు మహిళ పేరు మీద మండలంలో 935 మందికి పట్టాలు ఇవ్వటం జరిగిందన్నారు. అమ్మ ఒడి రూ. 7 కోట్లు, వైఎస్సార్ ఆసరా మూడు విడతలు 27,57,25,659, చేయూత 2 వేల మందికి రూ.7 కోట్లు, ఈ బీసీ నేస్తం 929 మందికి, 12 రకాల పింఛన్లు పథకాలు అమలు చేస్తున్న సీఎం వైస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీఎం రజీయ సుల్తాన్ బేగం మాట్లాడుతూ మహిళకు ప్రభుత్వం రాయితీ పథకాలు అమలు చేసిందని అందులో పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంబీ పథకాలు అమలు చేసిందన్నారు. పాల డెయిరీ పెట్టుకుంటే ఒక లక్షకు రూ.35 వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. జీవనోపాధులు మెరుగు పరుచుకోవడానికి పొట్టేళ్ల, గేదెలు పెంపకం వంటి మహిళకు మంచి పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. మండలంలో 1,208 గ్రూపులకు సంబంధించి 9,19,08,553 చెక్కును పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీలు వారీ ఆయా పంచాయతీల్లో డ్వాక్రా మహిళకు చెక్కులను పంపిణీ చేశారు. మండల ఉపాధ్యక్షురాలు తాత ఉమమహేశ్వరి, సీసీ రామారావు, అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



ఈతముక్కలలో వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న రవీంద్రరెడ్డి

వైఎస్సార్ బీమా నగదు అందజేత

వజ్జిరెడ్డిపాలెం (కొత్తపట్నం): మండలంలో వజ్జిరెడ్డి పాలెం గ్రామంలో నివాసం ఉంటున్న గుమ్మనంపాటి రమణమ్మ ఈ నెల 3న అనారోగ్యంతో మృతి చెందింది. వైఎస్సార్ పింఛన్‌కు కూడా అర్హురాలు. దీంతో వైఎస్సార్ బీమా సొమ్ము రూ. 1 లక్ష బినామినీ అయిన తను కుమారుడు గుమ్మలంపాటి సురేంద్రకు మంజూరయ్యాయి. అందులో భాగంగా మంగళవారం మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు సురేంద్రకు అందజేశారు. మిగత నగదు వారి అకౌంట్‌లో జమచేస్తామని సచివాలయం సిబ్బంది చెప్పారు. వి.గిరిష్‌బాబు, దోనెంపూడి రవి, దోనేంపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న గిరిష్‌బాబు

చంద్రప్రభ వాహనంపై స్వామివారి దర్శనం



కూచిపూడి నృత్యం ప్రదర్శించిన బృందం



చంద్రప్రభా వాహనంపై స్వామివారు

ఒంగోలు టౌన్: చెన్నకేశవస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు చంద్రప్రభా వాహనంపై దర్శనం ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. నళిని ప్రియ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. బుధవారం ఉదయం 10 గంటలకు శ్రీస్వామివారి కళ్యాణం జరుగుతుందని, ఈ కళ్యాణ మహోత్సవంలో ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులు హాజరు కానున్నట్లు పాలకమండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు తెలిపారు. ఈఓ డి.రజనికుమారి, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, ఈమని మదన్ మోహన్, దార్ల వెంకట రమణమ్మ, జూటూరి గీతా కుమారి, నెమ్మాని హరి పప్రియదేవి, సూపర్ బజార్ డైరక్టర్ వి.మురళి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి కల్యాణం

ఒంగోలు: ప్రసదిద్ధి గాంచిన కొండమీది శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి కళ్యాణ మహోత్సవం బుధవారం ఉదయం 10గంటలకు జరుగుతుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథం , ఈవో రజనీకుమారి పేర్కొన్నారు. ఒంగోలులోని శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం ప్రాచీన చారిత్రక ఆలయం అన్నారు. విజయనగర సామ్రాజ్య పాలకులకు సామంత రాజులైన మందపాటి రాజు సోదరులు రామభద్రరాజు, రఘుపతిరాజులు 16వ శతాబ్దం చివరలో వారి కోటలో ఆలయాన్ని ప్రతిష్టించారన్నారు. మహారాణి మంజులత ప్రతిరోజు దర్శించుకునే భాగ్యం కల్పించాలనే లక్ష్యంతో ఏర్పడిందన్నారు. రఘుపతి రాజు తన ఆస్థాన రాజపురోహితుడు అయిన సీతారామ అవధాని ఇతర పండితులతో చర్చించి శ్రీచెన్నకేశవస్వామి వారికికోట వెలుపల పెద్ద ఆలయం వెలుపల ప్రజల దర్శనార్థం నిర్మించిన ఆలయమే ప్రస్తుత ఆలయం అని వివరించారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు నిర్వహించేందుకు శ్రీరంగం నుంచి వేదపండితులు వచ్చి 1712లో స్వామివారి ఆలయాన్ని దివ్యంగా ప్రారంభించారని, అదే నేటి కేశవాద్రిగా, కేశవస్వామి పేటగా పిలవబడే శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి అన్నారు. ఈ దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారు, ఆండాళ్ అమ్మవారు, శ్రీసత్యన్నారాయణస్వామి, శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీ సంతాన వేణుగోపాలస్వామి, సప్తమాతృకలు , కొలను, నాగశిల ప్రతిష్టించారు. అటువంటి ప్రాముఖ్యత కలిగిన స్వామివారి కళ్యాణం ఉదయం 10గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులు హాజరై పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పిస్తారని, భక్తుల సహకారంతో తయారుచేసుకున్న స్వామివార్లు, అమ్మవార్లకు బంగారు మంగళసూత్రాలు , యజ్ఞపవీతంను కూడా బాలినేని శ్రీనివాసరెడ్డి చేతులమీదుగా ఆలయ పాలకమండలికి , కార్యనిర్వహణాధికారికి అందిస్తారన్నారు. ప్రస్తుత పాలక మండలి బాధ్యతలు చేపట్టినప్పటినుంచి బీఎంఆర్ వారి సహకారంతో దేవాలయ ప్రాంగణంలో నూతన కళ్యాణ మండపం నిర్మాణం, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ బ్రదర్స్ సహకారంతో స్వామివారి పుష్కరిణి నిర్మించామన్నారు. అంతే కాకుండా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సహకారంతో స్వామివారికి నూతన రథం కూడా తయారుచేయడం జరిగిందన్నారు. 7వతేదీ నూతనంగా నిర్మించిన పుష్కరిణిలో స్వామివారికి చక్రస్నానం నిర్వహణ జరుగుతుందన్నారు. కనుక భక్తులు మిక్కిలిగా విచ్చేసి స్వామివారి కళ్యాణాన్ని తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

మత్స్యరంగ మౌలిక సదుపాయాలపై మాగుంట ప్రశ్న

ఒంగోలు: ఫిషరీస్ అండ్ ఆక్వా కల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్/ మత్స్య సంపద, జల వ్యవసాయం మౌలిక సదుపాయాలు అభివృద్ధి నిధి కార్యక్రమ విశిష్ట లక్షణాలు, ఏపీలో ఆమోదించిన ప్రాజెక్టులు, వినియోగించిన నిధులు, కల్పించిన మౌలిక సదుపాయాల గురించి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్లో లేవనెత్తిన ప్రశ్నకు కేంద్ర మత్స్య, పశు సంరక్షణ, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పర్శోత్తం రూపాల సమాధానం ఇచ్చారు. 2018–19 నుంచి మత్స్య సంపద, జల వ్యవసాయం మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి కార్యక్రమాన్ని ఏపీతోపాటు ఇతర రాష్ట్రాలలో రూ. 7522 కోట్లతో కేంద్ర మత్స్యశాఖ అమలు చేస్తుందన్నారు. దీనికి ఇతర విషయాలకు కూడా అర్హత కలిగిన సంస్థలతో పాటు రాష్ట్రాలకు, రాష్ట్ర సంస్థలకు 12 సంవత్సరాలకు ఒకసారి కాలపరిమితితో, రాయితీతో కూడిన నిధులు ఏడాదికి 3 శాతం వడ్డీ రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. సమ్మతించిన రుణ సంస్థలు కూడా ఏడాదికి 5 శాతం పైబడి వడ్డీతో నిధులు ఇస్తాయన్నారు. ఏపీ ప్రభుత్వం, కార్యక్రమ అమలు సంస్థలు రూ. 1313.32 కోట్లు ఖర్చుతో ప్రతిపాదించిన 8 ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. మిగతా రాష్ట్రాలన్నింటికీ కలిపి రూ. 4275.31 కోట్లతో 113 ప్రాజెక్టులు ఆమోదించడం జరిగిందని, ఆంధ్రప్రదేశ్‌లో కాకినాడ జిల్లాలో ఉప్పాడా, బాపట్ల జిల్లాలో ఓడరేవు, నిజాంపట్నం వద్ద, కృష్ణా జిల్లాలో మచిలీపట్నం వద్ద నాలుగు ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి రూ. 1291.40 కోట్లతో వచ్చిన ప్రతిపాదనలకు కూడా కేంద్రం ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి పర్శోత్తం రూపాల సమాధానం ఇచ్చారు.

విధుల్లో అంకితభావం అవసరం

ఒంగోలు రూరల్: మండలంలోని ఆశ కార్యకర్తలు అంకితభావంతో విధులను నిర్వర్తించాలని డాక్టర్ ఎస్.వాణి అన్నారు. కరవదిలోని పీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా మాట్లాడారు. ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. గర్భిణులకు కాల్షియం పోషక పదార్థాలు సూచించడంలో, ప్రసవం తరువాత పుట్టిన బిడ్డలకు ముర్రు పాలు తాగించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మహిళలకు ప్రధానంగా రోగకారకాలైన పొగాకు వినియోగం, మద్యం, డ్రగ్స్ వినియోగంపై చైతన్య కలిగించాలన్నారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజనపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులను గూర్చి భర్త, అత్త తీసుకోవల్సిన జాగ్రత్తలను గూర్చి ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉండాలన్నారు. నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్టు ఫోన్ల వినియోగం, ఆశా యాప్ వినియోగం గూర్చి వివరించారు. అనంతరం నెలవారీ సమీక్షను సమీక్షించారు. ఎంపీహెచ్ఈవో శివప్రసాద్, హెచ్ఎస్ మాధవి, అజిత, ఎల్‌టీ మహేంద్ర, ఎస్ఎన్‌లు, భాను, జ్యోతి, విక్టోరియా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వాణి

ఒంగోలు కవులకు ఆహ్వానం

ఒంగోలు టౌన్: తిరుపతిలోని పుణ్యక్షేత్రం మహతి ఆడిటోరియంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహిత్య బ్రహ్మోత్సవాల్లో రచయిత బంతికట్ల నాగేశ్వరరెడ్డి, కవి డాక్టర్ మొగలి దేవలకు ఈ కార్యక్రమంలో కవితాగానం చేయడానికి ఆహ్వానిస్తూ ఆసంస్థ ప్రోగ్రామ్ ఆర్గనైజర్ కొల్లి రమావతి, కన్వీనర్ గుత్తా హరిసర్వోత్తమ నాయుడు ఆహ్వానపత్రాన్ని పంపించినట్లు రచయితలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.